## రోడ్ల అభివృద్ధికి కేంద్రం నిధులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో 31 రాష్ట్ర రహదారుల విస్తరణ, ఆధునికీకరణ కోసం కేంద్రం గురువారం రూ.850 కోట్లు మంజూరు చేసింది. వీటితో 31 రహదారులను 435.29 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. జిల్లాలవారీగా సుమారు 31 సింగిల్ లేన్ రోడ్లను డబుల్ లేన్లుగా మారుస్తారు. పలుచోట్ల వంతెనలు నిర్మిస్తారు. మహబూబాబాద్ జిల్లా గిరిపురం-రాంపురం రోడ్డు, కురవి-ఇల్లందు క్రాస్‌రోడ్డు, వరంగల్ జిల్లా చెన్నారావుపేట-మాచాపూర్ వయా ఉప్పరపల్లి, పల్లారిగూడ, ఆరేపల్లి-పరకాల, భూపాలపల్లిలో భుజ్‌నూర్-గుమ్మడేవ్‌పల్లె, హనుమకొండలో పరకాల-నార్లాపూర్, వర్ధన్నపేటలో పీడబ్ల్యూడీ రోడ్డు-శ్రీనగర్ వయా కొనకపాక, జగన్ తండా-లైబ్రరీ రోడ్డు, కట్ర్యాల-కొత్తపల్లి, ఇల్లంద-పర్వతగిరి వయా రామ్‌ధానితండా, వర్ధన్నపేట-కొక్కిరాలపల్లి, మురిపిరాల-జఫర్‌గఢ్, హనుమకొండ జిల్లాలోని ముదికొండ-మామునూరు, పెద్దపెండ్యాల-పున్నేల్, దర్గా-గుంటుపల్లి రోడ్డును డబుల్‌లేన్‌గా మారుస్తారు. డోర్నకల్‌లో ఆకేరు వాగుపై ఉల్లేపల్లి, మాధవపురం-మన్నెగూడెం మధ్య వంతెన నిర్మిస్తారు.





# ఓరుగల్లుకు హైరేంజ్ కార్లు

**ఒకే వేదికపైకి ప్రముఖ కంపెనీలు**

**రెండు రోజుల పాటు నగరంలో ఆటో షో**

**ఆధునిక వాహన వినియోగదారులకు సువర్ణావకాశం**

వరంగల్, మార్చి 14 : ఇన్నిరోజులూ మెట్రోపాలిటన్ సిటీలకే పరిమితమైన అత్యాధునిక కార్లు ఇప్పుడు ఓరుగల్లులో దర్శనమివ్వనున్నాయి. బ్రాండెడ్ కంపెనీల హైరేంజ్ కార్లు కొనాలనుకునే వారికి ఇక్కడే సువర్ణావకాశం రాబోతున్నది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద నగరంగా పేరున్న వరంగల్‌లో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టు డే' ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో నగరంలోని హయగ్రీవాచారి మైదానంలో నిర్వహించే 'ఆటో షో'లో ప్రముఖ కార్ల కంపెనీలు పాల్గొంటున్నాయి. ఒకే వేదికపై సరికొత్త మోడళ్లను ప్రదర్శించనున్నాయి. ఇప్పటి వరకు వరంగల్ మహా నగరంలో షోరూంలు లేని ఆడీ క్యూ త్రీ, వోల్వో ఎక్స్‌సీ 90 కార్లతో పాటు జీప్ (వ్రాంగ్లర్) కంపెనీలు తమ వాహనాల ఫీచర్స్‌ను వివరించనున్నాయి. సుమారు 10కి పైగా కార్ల కంపెనీలతో పాటు ద్విచక్ర వాహన కంపెనీలు సైతం ఆటో షోలో తమ ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తున్నాయి. మొదటిసారిగా పేరుమోసిన కార్ల కంపెనీలు వరంగల్ నగరంలో ఏర్పాటు చేసే ఆటో షోలో భాగస్వామ్యమవుతున్నాయి. ప్రముఖ కార్ల కంపెనీలు, మోటార్ బైక్, ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు ఒకే వేదికపై తమ ఉత్పత్తులను ఏర్పాటు చేయడం కొనుగోలుదారులకు మంచి అవకాశంగా మారనుంది. కొనుగోలుదారులు హైదరాబాద్‌లాంటి నగరాలకు పరుగులు తీయకుండా వరంగల్ నగరంలోనే బ్రాండెడ్ కార్లను 'ఆటో షో' వేదికగా బుక్ చేసుకునే అవకాశం కలుగనుంది. అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్న వరంగల్ మహానగరంలో వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఆటో షో ద్వారా అన్ని ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తెచ్చే ప్రయత్నం 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' చేస్తున్నాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఆటో షోలో ఆడీ, వోల్వో ఎక్స్ 90, జీప్(వ్రాంగ్లర్), స్కోడా, హుందాయ్, కియా, యమహా, నెక్సా, కిట్‌రాన్, చేతక్, హోండా కంపెనీలు తమ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి.











అవార్డు అందుకుంటున్న బండి రాములమ్మ, గొరిగె నీలమ్మ

# మన ఆడబిడ్డలకు రాష్ట్రస్థాయి పురస్కారాలు

**నగదు అవార్డులు అందుకున్న ఐదుగురు**



మంత్రి సీతక్కతో కలిసి ఆనందం పంచుకుంటున్న అవార్డు గ్రహీత దయ్యాల భాగ్య

**బోనాలు, కోలాటం కళలో రాములమ్మ, నీలమ్మ**

**జానపద నృత్యంలో భాగ్య.. డప్పు వాయిద్యంలో సారమ్మ.. ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా రాణి**



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన మునిగాల రాణి

*స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం/ మహబూబాబాద్ రూరల్/హసన్‌పర్తి, మార్చి 14 : వివిధ కళల్లో ప్రతిభ చూపుతున్న ఆడబిడ్డలను అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది. రాష్ట్రంలో మొత్తం 19 మంది రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాలు అందుకోగా వీరిలో ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు మహిళలున్నారు. బోనాలు, కోలాటం కళలో జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల నుంచి బండి రాములమ్మ, గొరిగె నీలమ్మ, జానపద నృత్యంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గొల్లగూడేనికి చెందిన దయ్యాల భాగ్య, డప్పు వాయిద్యంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్లకు చెందిన మట్టెడ సారమ్మ, ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన మునిగాల రాణి గురువారం హైదరాబాద్‌లో అవార్డులు అందుకున్నారు.*

రాష్ట్ర ప్రభుత్వం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు మహిళలు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవారులు అందుకున్నారు. నెల్లుట్లకు చెందిన బండి రాములమ్మ, గొరిగె నీలమ్మ బోనాలు, కోలాట నృత్య ప్రదర్శనలతో గుర్తింపు పొందగా వారి ప్రతిభకు అవార్డులు దాసోహమయ్యాయి. వీరికి రూ.లక్ష చొప్పున నగదు పురస్కారాన్ని మంత్రి దనసరి అనసూయ (సీతక్క), అధికారులు అందజేశారు. వీరికి పురస్కారం రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గూడూరు మండలం గొల్లగూడేనికి చెందిన దయ్యాల భాగ్యకు పుట్టుకతోనే కాలు లేదు. అయినా ఆమె మొక్కవోని ఆత్మస్థయిర్యంతో ముందుకెళ్తున్నది. ప్రస్తుతం తెలుగు యూనివర్సిటీలో ఎంఫిల్ చేస్తున్నది. మరోవైపు నాట్యాన్ని ప్రాణంగా ప్రేమించి నైపుణ్యం సాధించింది ఒంటికాలితోనే నృత్యం చేస్తూ అలరిస్తుంది. ఆమె ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ పురస్కారాన్ని అందించింది. హసన్‌పర్తి మండలం ముచ్చర్లకు చెందిన మట్టెడ సారమ్మ డప్పు వాయిద్య కళాకారిణి. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 200 మందికిపైగా యువకులకు ఆమె డప్పు వాయిద్యం నేర్పింది. ఈమె నైపుణ్యాన్ని గుర్తించిన ప్రభుత్వం అవార్డును అందించింది. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని అంగన్‌వాడీ సెంటర్-6లో విధు లు నిర్వర్తిస్తున్న మునిగాల రాణికి ఉత్తమ్మ పురస్కారం దక్కింది. సెంటర్‌లోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వంద శాతం పౌష్టికాహారం అందించడం, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం, ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగం గా గృహ సందర్శన చేయడం, దశాబ్ది ఉత్సవాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించడం, బీఎల్వోగా ఎన్నికల విధుల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్నది. ఆమె రెండోసారి అవార్డు అందుకోవడంపై సీడీపీవో ఫ్లోరెన్స్, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తంవ్యక్తం చేశారు.

## ఎండుతున్న గొంతులు

**ఎనుమాముల మార్కెట్‌లో తాగునీటికి కటకట**



ఖాళీగా ఉన్న రంజన్లు, డ్రమ్ములను చూపుతున్న రైతులు, హమాలీలు

*అది అసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్. వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొని నిత్యం వేల సంఖ్యలో రైతులు వస్తుంటారు. అధికారులు, సిబ్బంది, కార్మికులు వందల సంఖ్యలో ఉంటారు. మరోపక్క వేసవి మొదలైంది. అయితే, తాగునీటిని అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గురువారం మిర్చి యార్డులోని ఏ షెడ్‌లో చూసినా ఖాళీ డ్రమ్ములు, రంజన్లు దర్శనమిచ్చాయి. రైతులు, హమాలీలు గుక్కెడు నీటి కోసం అల్లాడిపోయారు. పొద్దున్నే రంజన్లలో నింపిన నీళ్లు గంట వ్యవధిలోనే ఖాళీ అయ్యాయి. మళ్లీ నీటిని తీసుకురావాల్సిన వారు పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు, కార్మికులు వాపోయారు.*

*- వరంగల్ ఫొటోగ్రాఫర్*



పాడె మోస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, యాత్రలో ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

# అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

- **నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు**
- **వడ్డెపల్లిలో అంత్యక్రియలు.. పాడె మోసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి**

పెద్దవంగర, మార్చి14 : మాజీ మంత్రి నెమరుగొమ్ముల యతిరాజారావు తనయుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు(74) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. గురువారం ఆయన స్వగ్రామం పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు వెంటరాగా, అశ్రునయనాలతో ఆయనకు వీడ్కోలు పలికారు. 1999లో ప్రజాదీవెన కార్యక్రమంలో టీడీపీలో చేరిన ఆయన చెన్నూరు, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎన్నో సేవలు చేశారు. కుటుంబ సభ్యులు, పాలకుర్తి నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. సుధాకర్‌రావు తనయుడు వెంకట అనంతరావు అంత్యక్రియలు చేపట్టారు.

### మాజీ ఎమ్మెల్యేకు నేతల నివాళి

సుధాకర్‌రావు పార్థివదేహాన్ని స్వగ్రామానికి గురువారం ఉదయం 11గంటలకు తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తొలి శాసన సభ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ కవిత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, సుదర్శన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, శ్రీరాం భద్రయ్య, ధర్మారావు, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నవీన్, ఎంపీపీలు, జడ్పీటీసీలు సుధాకర్‌రావు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### కన్నీటి పర్యంతమైన ఎర్రబెల్లి

మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు అంత్యక్రియలు పూర్తయ్యే వరకు మాజీ మంత్రి దయాకర్‌రావు అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. అంతిమయాత్రలో పాల్గొని స్వయంగా పాడె మోశారు. నియోజకవర్గానికి అన్ని విధాలా గుండె ధైర్యంగా ఉన్న గొప్ప శక్తిని కోల్పోయానని కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో నాయకులు నెహ్రూనాయక్, యాదగిరిరావు, రామచంద్రయ్యశర్మ, సుధీర్‌కుమార్, సంజయ్, గాంధీనాయక్, ఎంపీపీలు, జడ్పీటీసీ, ఆయా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నేత కొడుకు వేధింపులు..**

# యువతి ఆత్మహత్య

**హైదరాబాద్‌లో ఘటన..అలుబాకలో విషాదం**



సుంకర సాహితి(ఫైల్)

ములుగు, మార్చి14 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లాకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. కాగా ఆమె మృతికి ఓ కాంగ్రెస్ నేత కొడుకు వేధింపులే కారణమని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం(నూగూరు) మండలం అలుబాకకు చెందిన సుంకర వెంకటసుబ్బారావు కుమార్తె సాహితి(21) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. గురువారం ఆమె తండ్రి వెంకటసుబ్బారావుతో పాటు కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలను మీడియాతో పాటు పోలీసులకు వివరించారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు కొడుకు హరీశ్ తమ కుమార్తెను మానసికంగా వేధించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడని చెప్పారు. ఈ విషయాన్ని తమ కుమార్తె హరీశ్ తండ్రి మోహన్‌రావుకు చెబితే 'ఏం చేసుకుంటారో చేసుకోండి' అని బెదిరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎవరికీ చెప్పుకోలేక తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని బోరున విలపించారు. తండ్రి రాజకీయ అండ చూసుకొని తమ కుమార్తె చావుకు కారణమైన హరీశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం రాత్రి సాహితి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా, గ్రామస్తులు, స్నేహితులు కలిసి ర్యాలీ తీసి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## టీజీతోనే వాహనాల రిజిస్ట్రేషన్

**మంత్రి పొన్నం ప్రభాకర్**





హనుమకొండ, మార్చి 14 : వాహనాల రిజిస్ట్రేషన్‌ను శుక్రవారం నుంచి టీజీతో చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష మేరకే టీజీగా మార్చుతున్నామన్నారు. శుక్రవారం నుంచి టీజీ పేరుతో 0001 నంబర్ల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటి వరకు రిజర్వేషన్ నంబర్లు బుక్ చేసిన వారికి 15 రోజుల్లో న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అలాగే, తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పు, తెలంగాణ గీతం విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ జారీని కఠినతరం చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో 3వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు.

